రాయల విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

రాయల విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర, నాయకులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 3: తల్లాడ మండలం మిట్టపల్లి సెంటర్‌లో ఖమ్మం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దివంగత రాయల వెంకటశేషగిరిరావు విగ్రహ నిర్మాణ పనులకు సోమవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శంకుస్థాపన చేశారు. రాయల వెంకటశేషగిరిరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, పట్టణ అధ్యక్షుడు గరిడేపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ జోనల్ చైర్మన్ దిరిశాల దాసురావు, కేతినేని చలపతిరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, బద్ధం కోటిరెడ్డి, వజ్రాల రామిరెడ్డి, మాజీసర్పంచ్‌లు మువ్వా మురళీ, కృష్ణార్జునరావు, శేఖర్‌బాబు, శివారెడ్డి, వనిగండ్ల అశోక్, వరపర్ల ఉదయ్, నాయకులు ముత్తారెడ్డి, పాపులు, రఘు, నారపోగు జమలయ్య, చల్లా వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ధ్వజస్తంభం ప్రతిష్ఠ

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాల

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 3: మండలంలోని గోళ్లపాడు గ్రామంలో అలివేలు మంగతయారు వెంకటేశ్వర సమేతా బొడ్రాయి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అర్చకులు, గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. కందాళ మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి ఆశిస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, కళ్లెం వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్, ముత్యం కృష్ణారావు, సంజీవరెడ్డి, అక్కినపల్లి వెంకన్న, గోళ్లపాడు గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయ భవన శతాబ్ది వేడుకలు

ఖమ్మం, ఫిబ్రవరి 3: అడవులు లేనిది.. అభివృద్ధి లేదని, మనిషి అభివృద్ధి చెందలేడని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం ఖమ్మంలోని అటవీశాఖ కార్యాలయ భవన శతాబ్ది ఉత్సవాల్లో ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సి.సువర్ణ, సీపీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ డాక్టర్ భీమానాయక్, జిల్లా అటవీ అధికారి సిద్దార్ద్ విక్రమ్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అధికారులకు ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. అడవులకు ఉన్న విలువ, అడవుల అవసరం గురించి విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో అవగాహన, చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ విశ్రాంత అధికారులు, ఎఫ్‌డీవోలు, ఎఫ్ఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ విజిట్‌కి రెబ్బవరం విద్యార్థులు

వైరాటౌన్, ఫిబ్రవరి 3: వైరా మండలం రెబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పీఎం పాఠశాల పథకంలో భాగంగా అధికారుల సూచనల మేరకు ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్క్ ఫీల్డ్ విజిట్‌కి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, ఫారెస్ట్ అధికారులు విద్యార్థులకు అడవుల పెంపకం, వైల్డ్ లైఫ్ మొదలగు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెబ్బవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకట్రావు, కిరణ్, శ్రీనివాసులు, దొడ్డా వరప్రసాద్, వేదన, సరస్వతి, నర్సింహారావు, పిడి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

ముదిగొండ, ఫిబ్రవరి 3: ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు వైద్యాధికారి అరుణాదేవి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 1నుంచి 10 సంవత్సరాల పిల్లకు డివార్మింగ్ మాత్రలు ఇస్తామన్నారు. తహసీల్దార్ సునీత ఎలిజెబిత్, ఎంఈవో రమణయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన

వైరాటౌన్, ఫిబ్రవరి 3: వైరా పట్టణంలో మిషన్ భగీరథ పనులను మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్ఈ సదాశివరావు, ఈఈ వాణిశ్రీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సినీ నిర్మాత ఆత్మహత్య

గోవాలో బలవన్మరణానికి పాల్పడిన బోనకల్లు మండలవాసి

బోడేపూడి కృష్ణప్రసాద్ చౌదరి (ఫైల్)

బోనకల్లు, ఫిబ్రవరి 3: ఉన్నత చదువులు చదివినా విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డాడు. పలు సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా నిర్మాతగా వ్యవహరించి చివరకు అప్పులపాలయ్యాడు. మానస్తాపంతో గోవాలో బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బోనకల్లు మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన బోడేపూడి శేషగిరిరావు, విజయ దంపతులకు కుమారుడు, సినీ నిర్మాత, ఫిలిం డిస్ట్రిబ్యూటర్ బోడేపూడి కృష్ణప్రసాద్ చౌదరి(కేపీ చౌదరి)(38), కుమార్తె ఉన్నారు. కృష్ణప్రసాద్ బీఈ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. పెళ్లి చేసుకున్న సోదరి యూఎస్‌లో స్థిరపడ్డారు. తండ్రి న్యాయవాదిగా, తల్లి భద్రాద్రి జిల్లా పాల్వంచ ప్రాంతంలో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. అయితే కృష్ణప్రసాద్ సినీరంగంపై మోజుతో హైదరాబాద్ చేరుకొని సినీ ప్రముఖులతో పరిచయాలు ఏర్పర్చుకున్నాడు. 2016లో కబాలి సినిమా నిర్మాతగా, సర్దార్ గబ్బర్‌సింగ్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించాడు. ఈ క్రమంలో ఆర్థికంగా బాగా నష్టపోయిన కృష్ణప్రసాద్ అప్పులు తీర్చేందుకు తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని అమ్మజూపాడు. అంతేకాక డ్రగ్స్ సరఫరా కేసులో పోలీసులకు పట్టుబడి జైలుపాలయ్యాడు. దీంతో విషయం తెలిసిన తల్లిదండ్రులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చిన కృష్ణప్రసాద్.. తల్లిదండ్రులు, భార్య, కుమారుడితో కూడా సంబంధం లేకుండా హైదరాబాద్‌లోనే ఉండిపోయాడు. తండ్రి మృతిచెందగా.. తల్లి రాయన్నపేటలోనే ఉంటుంది. మళ్లీ వ్యాపార లావాదేవీలు కొనసాగించేందుకు కృష్ణప్రసాద్ గోవా వెళ్లాడు. అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందులు మరింతగా బాధించడంతో మనస్తాపానికి గురై అక్కడే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని అక్కడి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

జిల్లాలో 53మంది బాలకార్మికులకు విముక్తి

పోలీస్ క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్, ప్రొబేషనరీ ఎస్సైలకు ఉత్తర్వులు అందిస్తున్న సీపీ

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 3 : జిల్లాలో ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో భాగంగా 53 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో బాలురు-44, బాలికలు-4 మొత్తం 53 మంది బాలబాలికలను గుర్తించి విముక్తి కల్పించామన్నారు. ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 16 మంది, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 37మంది ఉన్నారని తెలిపారు. దీనిలో 2 కేసులు నమోదు కాగా 44 మంది బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. మిగిలిన 9మందిని రెస్క్యూ హోంకు తరలించామని తెలిపారు. బాలల హక్కులు కాపాడటంతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయలన్నారు. బాల కార్మికుల సమాచారం ఉంటే, ఎవరైనా పనులు చేయిస్తే వెంటనే 1098కు కాల్ చేయాలని సూచించారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పోలీస్ క్రీడాకారులకు సీపీ అభినందన

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 3 : తెలంగాణ రాష్ట్ర 3వ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025లో 42 పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం అభినందించారు. కరీంనగర్‌లోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగిన క్రీడా పోటీల్లో 29 క్రీడాంశాలకు 20 పోలీస్ జోన్ల నుంచి సుమారు 2,400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కరీంనగర్‌తోపాటు సమీప ప్రాంతాల్లోని 12వేదికల ద్వారా ఈ క్రీడా పోటీలను నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, షటిల్, బ్యాడ్మింటన్, జూడో, వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, షటిల్ టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, తదితర పోటీల్లో పతకాలు సాధించారు. ఓవరల్ ఛాంపియన్‌షిప్ మూడోస్థానంలో భద్రాద్రి జోన్ నిలిచింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీస్ ఉద్యోగమనేది ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, ఒత్తిడిని అధిగమించేందుకు ఇలాంటి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. మహిళా ఉద్యోగులు సైతం రాష్ట్ర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని పతకాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు నర్సయ్య, సువీల్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రొబేషనరీ ఎస్సైలకు పోస్టింగ్‌లు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 3 : జిల్లాలో తొమ్మిది మంది ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లకు(సివిల్) ఐదునెలల శిక్షణలో భాగంగా వివిధ పోలీస్‌స్టేషన్లను కేటాయిస్తూ పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ట్రైనీ ఎస్ఐలుగా శిక్షణ పూర్తి చేసుకుని ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. పోస్టింగ్‌లు పొందిన వారిలో బదావత్ హరికృష్ణ- ఖమ్మంరూరల్, మెడమ్ తేజసర్వర్‌రెడ్డి- రఘునాథపాలెం, గడ్డాల అశోక్‌కుమార్- సత్తుపల్లి, పొదిలి రామకృష్ణ- ఖమ్మం వన్‌టౌన్, వెంపటి పవన్- వైరా, కొండా సురేష్- ఖమ్మం త్రీటౌన్, బానోత్ వెంకటేష్- తల్లాడ, వానంపల్లి రమేష్- ఖమ్మం టూటౌన్, నైనినావితా- ఖానాపురం హవేలి ఉన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 3: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజ, డీఆర్‌డీవో సన్యాసయ్యలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణిలో స్వీకరించిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన కె.ద్రౌపతి, నగరంలోని వీడీవోస్ కాలనీకి చెందిన ఎస్.ప్రసాద్‌రెడ్డి తదితరులు తమ తమ సమస్యలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 3: రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర నీటిపారుల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలతో కలిసి సోమవారం మండలంలో పర్యటించారు. తొలుత ఇటీవల మోడల్ విలేజ్‌గా ప్రకటించిన ఆరెంపుల గ్రామంలో పర్యటించారు. అనంతరం నూతన ఇండ్ల నిర్మాణం నిమిత్తం ముగ్గులు పోసుకున్న ఇండ్లకు వెళ్లి లబ్దిదారులతో మాట్లాడారు. అనంతరం గోళ్లపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయనిర్మాణానికి తనవంతుగా రూ.లక్ష అందజేశారు. బైపాస్ రోడ్డులో బానోతోత్ భాస్కర్ ఏర్పాటు చేసిన టీ వరల్డ్‌ను ప్రారంభించారు.

కాంగ్రెస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు

మధిర, ఫిబ్రవరి 3: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు కాంగ్రెస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మధిర మున్సిపాలిటీ 21వ వార్డు ఇన్‌చార్జి, బీఆర్ఎస్ నాయకుడు వేల్పుల శివ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 21వ వార్డు నుంచి బీఆర్ఎస్‌కు చెందిన 200 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరితే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇప్పిస్తామని చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వారికే కండువాలు కప్పుకొని బీఆర్ఎస్ వారు చేరినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మరోసారి మధిర మున్సిపాలిటీ బీఆర్ఎస్ అత్యధిక సీట్లను సాధించుకుంటుందని, ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు.

వనదర్శిని కార్యక్రమం

పెనుబల్లి, ఫిబ్రవరి 3: మండలంలోని పులిగొండ ఏరియాలో తల్లాడ మండలం కుర్నవల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు సోమవారం వనదర్శినిలో భాగంగా అడవిని చూపించారు. విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతిఒక్కరు చెట్లు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంవో రాజశేఖర్, హెచ్ఎం ఝాన్సీరాణి, ఎఫ్ఆర్‌వో ఉమ, రాంసింగ్, ఎఫ్‌బీవో భరత్‌కుమార్, సమత, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అమలు చేయాలి

కారేపల్లి, ఫిబ్రవరి 3: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని భాగం రామనర్సయ్య భవన్‌లో సోమవారం జరిగిన సీపీఎం సింగరేణి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్ అర్హత ఉన్నా రాక అనేక మంది అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, లేకపోతే పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కొండబోయిన నాగేశ్వరరావు, కె.నరేంద్ర, వజ్జా రామారావు, పండగ కొండయ్య, సూరబాక ధనమ్మ, రవి, ఉపేందర్, వెంకటేశ్వర్లు, శోభన్, లక్ష్మణ్, ఏకాంబరం, కృష్ణ, కిషన్, సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన

మాట్లాడుతున్న కస్తాల సత్యనారాయణ

మధిర, ఫిబ్రవరి 3: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ అన్నారు. సోమవారం మధిర షెడ్యూల్ కులాల వసతిగృహంలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన పునశ్చరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదోతరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులు, అధ్యాపకుల చేత బోధన జరుగుతుందని, అనుభవం లేని ఉపాధ్యాయుల ద్వారా ఫలితాలు రాణించడం సాధ్యం కాదన్నారు. ఉపాధ్యాయుల బోధనపై విద్యార్థులు శ్రద్ధతో అభ్యసించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మధిర డివిజన్ సహాయ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కొత్తా వెంకటేశ్వరరావు, వసతిగృహ సంక్షేమ అధికారులు ఎస్‌కే.సలీం, సీహెచ్.ధనలక్ష్మి, టీ.కృష్ణవేణి, దశరద్, కే.ప్రభాకర్, వెంకటేశ్వర్లు, మార్తమ్మ, శ్రీధర్, స్వప్న, అంజిబాబు, శరత్, అన్వర్, హసీనా పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో సమ్మె సైరన్!

- నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాల్లేవు..
- పట్టించుకోని అధికారులు, గుత్తేదారు
- కన్నెత్తి చూడని కాంగ్రెస్ సర్కారు పెద్దలు
- సమ్మె బాటలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు

కార్మికులతో మాట్లాడుతున్న మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 3 : 'అది పేరుకే పెద్దాసుపత్రి.. అడుగడుగునా అన్నీ సమస్యలే.. రోగులకు సరైన సేవలు లేవు.. అక్కడ పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందికి వేతనాల్లేవు. ఒక్కటి, రెండూ కాదు.. గత నాలుగు నెలలుగా దవాఖానలో పారిశుధ్యం, పేషెంట్ కేర్, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పస్తులతో అలమటిస్తున్నారు. గుత్తేదారు, అధికారుల కాళ్లావేళ్లా పడ్డా కనికరం చూపించడం లేదు. వారి నిర్లక్ష్యానికి విసుగెత్తిన బడుగుజీవులు సమ్మె సైరన్ మోగించారు. పెండింగ్‌తో కలిపి మొత్తం వేతనాలు ఒకేసారి ఇచ్చేవరకు పనిలోకి వెళ్లేది లేదంటూ భీష్మించారు. వేతనాల కోసం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కలిపి మొత్తం 259 మంది సమ్మె బాట పట్టడంతో సోమవారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు కార్మికులతో చర్చించారు. అయితే పూర్తిస్థాయి వేతనాలను ఇచ్చేవరకు పనులు చేసేది లేదని కార్మికులు తేల్చిచెప్పారు.

ఆందోళన చేస్తేనే వేతనాలు..

కాంగ్రెస్ సర్కారు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమంవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కేవలం పదమూడు నెలల కాలంలో కార్మికులు మూడు దఫాలు వేతనాల కోసం ఆందోళన చేయడం గమనార్హం. ఆయా సందర్భాల్లో కలెక్టర్ జోక్యం చేసుకుని రెండునెలల జీతం ఇప్పించి కుదుట పరిచేలా చేశారు. కానీ..! ఆ తర్వాత వారి పరిస్థితి షరామామూలే. ప్రస్తుతం నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

పాఠశాలకు గేటు వితరణ

వేంసూరు, ఫిబ్రవరి 3: మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి తుమ్మూరు వెంకటరెడ్డి రూ.50 వేలు విలువ గేటును సోమవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్న పాఠశాల పూర్వవిద్యార్థులు బండి పార్థసారధిరెడ్డి, బండి రామకృష్ణారెడ్డి, కుటుంబసభ్యులు మందపాటి సత్యనారాయణరెడ్డి పాఠశాల పూర్వవిద్యార్థులు, గ్రామస్తులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బొంతు శ్రీనివాసరావు, చైర్మన్ బండి కోమలి, సత్తుపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గొర్ల వెంకటప్పరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సంజీవరెడ్డి, గ్రామపెద్దలు తుంబూరు వెంకటరెడ్డి, సంక్షేమ కమిటీ చైర్మన్ బండి మురళీధర్‌రెడ్డి, లింగారెడ్డి, పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ అరుణ్

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 3 : ఖమ్మం నగరంలోని గీతాంజలి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభను కనబర్చినట్లు కరస్పాండెంట్ టీవీ అప్పారావు సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ప్రకాష్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్, హిమాన్షు, సాగసాత్విక్, రామ్‌చరణ్, నవీన్ జిల్లాస్థాయిలో మొదటిర్యాంక్‌లు సాధించారన్నారు. విద్యార్థులను డైరెక్టర్ టీ పద్మ, టీ అరుణ్ అభినందించారు.

విద్యాసంస్థల్లో వసంత పంచమి వేడుకలు


క్రియేటివ్ గ్రామర్ స్కూల్‌లో


శ్రీచైతన్య గ్లోబల్ విస్టాలో...

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 3: ఖమ్మం నగరంలోని ప్రైవేట్ స్కూల్స్‌లో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమాల్లో స్మార్ట్‌కిడ్జ్‌లో కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య పాల్గొన్నారు. శ్రీచైతన్య గ్లోబల్ విస్టా లో చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య పాల్గొన్నారు. క్రియేటివ్ గ్రామర్ స్కూల్‌లో కరస్పాండెంట్ బిజ్జాల కమలాకర్, డైరెక్టర్ కౌశిక్ పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

కూసుమంచి, ఫిబ్రవరి 3: అర్హులైన ప్రతి జర్నలిస్టుకి ఇండ్ల స్థలం మంజూరు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ,సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక విజయరాఘవ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు

ఖమ్మం, ఫిబ్రవరి 3: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తానని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సోమవారం తనను కలిసిన జర్నలిస్టుల మూడు యూనియన్లు, హౌసింగ్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్త పాలసీతోపాటు ఖమ్మంలోని స్తంభాద్రి జర్నలిస్ట్ సొసైటీ అంశంలో కూడా న్యాయ నిపుణులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో జర్నలిస్టులు వనం వెంకటేశ్వర్లు, వల్లా కొండలరావు, చిర్రా రవికుమార్, కనకం సైదులు, సాంబశివరావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామారావు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 3: క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మహిళా డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీవో ఎన్‌సీడీ డాక్టర్ డీ రామారావు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, మురళీ మోహన్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఖమ్మంఅర్బన్, ఫిబ్రవరి 3: తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మేలో జరిగే టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించాలని కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుంతో ఈనెల 10వ తేదీ వరకు చెల్లించవచ్చునని పేర్కొన్నా రు. పరీక్ష ఫీజును అధ్యయన కేంద్రం లేదా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు.

ఇంగ్లిష్ గ్రామర్ కోర్సు ప్రారంభం

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 3 : డిగ్రీ చదువుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో రాసే పోటీ పరీక్షల కోసం ఇంగ్లిష్ గ్రామర్ సర్టిఫికెట్ కోర్సును ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. గ్రామీణ విద్యార్థులకు నెలరోజులపాటు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి తెలిపారు. కార్యక్రమంలో బానోత్‌రెడ్డి, నర్సమ్మ, రవికుమార్, బంగారి, శివాజీ, సరిత, కోటేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన పకడ్బందీగా జరపాలి

పెనుబల్లి, ఫిబ్రవరి 3: ఎన్నికల హామీల్లో భాగంగా బీసీ కులగణనను తెలంగాణ ప్రభుత్వం తూతూమంత్రంగా చేపట్టకుండా బీసీ కులాల్లో అన్నివర్గాలను సమన్వయపరిచి పకడ్బందీగా లెక్కలు చేపట్టాలని మాజీ జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకు అతీతంగా బీసీ కులాలు అందరిని సమన్వయపరుస్తూ లెక్కలు చేపట్టిన నాడే కులగణనపై స్పష్టత వస్తుందన్నారు. ఆలస్యమైనా స్పష్టమైన విధానంతో పద్ధతి ప్రకారం ముందుకెళ్లాలని తెలిపారు.

డిజిటల్ క్రాప్ బుకింగ్ విధానం పరిశీలన

వైరాటౌన్, ఫిబ్రవరి 3: వైరా మండలం సోమవరం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య డిజిటల్ క్రాప్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో క్రాప్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ విధానం వలన రైతులకు పంట నమోదు కార్యక్రమం ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైరా సహాయ వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, ఎంఏవో మయాన్ మంజుఖాన్, ఏఈవోలు, రైతులు కొల్లి శ్రీనివాసరావు, కొల్లి నర్సింహారావు, గొల్లపూడి వెంకటేశ్వర్లు, జవ్వాజి జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

కారేపల్లి, ఫిబ్రవరి 3: మరమ్మతుల కారణంగా పది రోజుల పాటు గేట్ రేలకాయలపల్లి సమీపంలోని రైల్వే గేటును మూసి వేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమలపాడు-తడికలపూడి రైలు మార్గంలో ఉన్న ఈ గేటు మూసి వేయడం వల్ల గేటు రేలకాయలపల్లి నుంచి ఫైల్ తండా వెళ్లే ప్రయాణీకులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. మరమ్మతులు పూర్తి చేసిన తర్వాత ఈ నెల 15న తిరిగి రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.

డిప్యూటీ వార్డెన్‌పై పోక్సో కేసు నమోదు

కారేపల్లి, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని రేలకాయలపల్లి గిరిజన బాలుర వసతి గృహం డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లుపై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎన్.రాజారాం తెలిపారు. విద్యార్థులు తమను లైంగికంగా వేధిస్తున్నాడని డిప్యూటీ వార్డెన్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ఇటీవల ఏటీడబ్ల్యూఓ విచారణ జరిపి డిప్యూటీ వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. గత నెల 31న సస్పెండ్ నోటీస్ ఇచ్చిన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుపై దాడికి పాల్పడిన వార్డెన్ తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందతున్న డిప్యూటీ వార్డెన్‌పై ఓ విద్యార్థి తండ్రి చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రాజారాం పేర్కొన్నారు.

లారీని బైక్ ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 3: రోడ్డు మీద ఆగిఉన్న లారీకి బైక్ ఢీకొట్టి ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డ ఘటన సోమవారం తిరుమలాయపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. దమ్మాయిగూడెనికి చెందిన రెబ్బలపల్లి కిశోర్ (24), చామకూరి నగేశ్ (22) ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. తిరుమలాయపాలెం పెట్రోల్ బంక్ సమీపంలోకి వెళ్లగానే బైక్ అదుపుతప్పి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో కిశోర్ పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు, గ్రామస్తులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ, ఫిబ్రవరి 3: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గంధసిరి, పెద్దమండవ శివార్లలోని మున్నేరు నుంచి ఇసుక తరలిస్తున్నారు. ముదిగొండ శివారులో వాహన తనిఖీ చేస్తుండగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయగా వీరి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవటంతో డ్రైవర్లను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశామని సీఐ మురళీ తెలిపారు.